

# ఎందుకే నీకింత తొందరా...

- బలభద్రపాత్రుని రమణి



## పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం
## కౌముది నిర్వహించిన నవలల పోటీ (2023)లో
## బహుమతి పొందిన ఉత్తమ నవల
## (గత సంచిక తరువాయి)

**"జోక్స్ ఎ పార్ట్..** ఎందుకెళ్ళావ్?" అడిగాడు.

"పరిమళ ప్రేమ రాయబారం మోసుకొచ్చా" చెప్పాను.

"ఏదో సామెత వుండాలి తెలుగులో. తనకి గతిలేదు. కానీ మెడకి డోలు అనీ" అన్నాడు.

"తా దూరకంతలేదు. మెడకో డోలు" అన్నాను.

"వావ్! నీకు చాలా తెలుగొచ్చు" అన్నాడు.

"సరే! ధీరజ్ ఒప్పుకునేటట్లు లేడు. ఆ మందాకిని ఎవరో ఆంటీని రేపు అడగాలి. ఆ ప్రసక్తే ఇప్పటిదాకా రాలేదు మాటల్లో" అన్నాను.

"అడిగి చూడు. ఇద్దరూ మెచ్యూర్డ్ ఎడల్ట్స్. వాళ్ళు ఒకళ్ళు చెప్తే ఒప్పుకుంటారని అనుకోను" అన్నాడు.

"ఇద్దరికీ ఒకరంటే ఒకరికి చాలా ప్రేమ" అన్నాను.

"ప్రేమ వుంటే పెళ్ళి చేసుకోవాలని రూలేం లేదు" అన్నాడు.

"వితండవాదీ ఇంక ఆపు. నేను పడుకోవాలి" అన్నాను.

"ఇంత రాత్రి నేను గుర్తుకు వచ్చానంటే అర్థం. నామీద ప్రేమ అనేగా" అన్నాడు.

నా అరచేతిలో ఎర్రగా పండిన గోరింటాకు చూసుకుంటూ "మందారంలా పూసింది. నాకు మంచి మొగుడొస్తాడని ఆంటీ అంటేనూ" అన్నాను.

"అదే ప్రేమంటే మరి .ఐ లవ్ యూ" అన్నాడు.

"లవ్ మరీ చీప్ అయిపోయింది" అన్నాను.

"కాస్ట్ లీ లవ్ అని ప్రూవ్ చేసుకుంటాలే ఇండియా వచ్చి" అన్నాడు.

ఇద్దరం గుడ్‌నైట్ చెప్పుకున్నాక. రేపు ఆంటీని మందాకిని గురించి అడగాలి, కనీసం ఫోటో అయినా చూపించమనాలి అనుకుని పడుకున్నాను.

మర్నాడు ఆలశ్యంగా లేచాను.

అరవింద ఆంటీ గట్టిగా పూజ గదిలో "లక్ష్మీ క్షీర సముద్ర రాజ తనయా." అని స్తోత్రం చదువుతున్నారు.

తాతగారు పాదులలో తవ్వుతున్నారు.

గౌరి ఇల్లు ఊడుస్తూ ఏదో కూనిరాగం తీస్తోంది.

మొహం కడుక్కుని, మేడ మెట్లు దిగి వచ్చేసరికీ, ధీరజ్ పేపర్ చూస్తున్న వాడల్లా నన్ను చూసి లేచి "కాఫీ తాగుదాం. కలుపుతాను" అని వంట గదిలోకి వెళ్ళాడు.

నేనూ వెనకాలే వెళ్ళి, అతను డికాషన్‌లో పాలు కలిపి స్టౌ మీద పెట్టాక,

"పరికి ఏం చెప్పనూ?" అడిగాను.

"గంపెడు పిల్లల్ని కనమని దీవించానని చెప్పు" అన్నాడు.

"ఎందుకనీ?" అన్నాను.

"ఏం దీవించమంటావ్?" అన్నాడు.

"నీ సమాధానం కావాలి. తను ఎల్లకాలం అలా మోడులా పడివుండదు. నిన్ను కోరుకుంటోంది" అన్నాను.

కాఫీ స్టీలు గ్లాసులో పోసి నా చేతికి అందించాడు.

"నేను ఈరోజు వెళ్ళిపోతున్నాను. నాన్నగారు ఇప్పటికే చాలాసార్లు ఫోన్ చేసారు రమ్మని" అన్నాను.

"నా సమాధానం అదే" అన్నాడు.

"మనసు మార్చుకోవా? ఆ మందాకినినే చేసుకుంటావా?" కోపంగా అడిగాను.

"చేసుకుంటాను. నీ ఫ్రెండ్‌లా వెన్నుపోటురాదు ఆ పిల్లకి" అన్నాడు.

అరవింద గదిలోకి వస్తూ "ఈ రోజు జున్ను వండుతాను. మందాకినీ, మావయ్య కూడా వస్తున్నారు" అన్నారు.

నాలో కుతూహలం పెరిగిపోయింది.

"ఎప్పుడొస్తున్నారూ? సాయంత్రం బండికి వెళ్దాం అనుకుంటున్నాను" అన్నాను.

"అప్పుడే ఏం తొందరా? సంక్రాంతి దాకా ఉండచ్చుగా" అందావిడ.

"అమ్మా నాన్నా బెంగ పెట్టుకున్నారు, అమెరికానుండి వచ్చాకా, వెంటనే ఇటొచ్చేసానుగా" అన్నాను.

"ఏమ్మా? ఇంటిమీదకి గాలి మళ్ళిందా?" తాతగారు, నవనవలాడే వంకాయలూ, గోంగూరా కోసుకుని పంచెలో పోసి తెస్తూ అడిగారు.

"వంకాయలు కారం పెట్టి చెయ్యమ్మా, మందాకినికి ఇష్టం" ధీరజ్ చెప్పి, వెళ్ళిపోయాడు.

కాఫీ గ్లాసులో అతన్ని అనుసరించాను.

"ధీరజ్ అంతేనా?" అడిగాను.

"ప్రశ్న నన్ను కాదు అడగాల్సింది" అన్నాడు.

"సరే చూస్తాలే ఆ మందాకిని ఎంత అందగత్తో?" అన్నాను.

పరిమళ విషయం వాళ్ళ ముందు ఎత్తద్దు. నీ రాక గురించి ఏం విన్నారో మావయ్యా వాళ్ళు ఇంత హఠాత్తుగా వస్తున్నారు" అన్నాడు.

అతని వార్నింగ్ నాకు అర్ధమైంది.

ఆ రోజు అరవిందగారు గారెలూ, అల్లం పచ్చడీ, జున్నూ టిఫిన్‌కి చేసారు. కాసేపు వీణ వాయించారు అరవింద.

ఎంత బాగుందో వినడానికి.

తరువాత స్నానం చేసి అత్తాకోడళ్ళ రేవుకి వెళ్ళాం.

"ఆంటీ! మీకు ఎలాంటి కోడలు కావాలి?" అక్కడ చెట్లు చూస్తూ అడిగాను.

ఆవిడ కూడా తెచ్చిన పసుపు కుంకుమలు వాటికి పెట్టి, చలిమిడి ప్రసాదం కూడా పెట్టారు. నా ప్రశ్నకి నవ్వి ప్రశాంతంగా అన్నారు.

"మా ధీరూని ప్రేమగా చూసే అమ్మాయికావాలి" అని.

"మేనరికం వుందటగా? అదే మీ అన్నయ్యగారి అమ్మాయి. మందాకిని.. బావుంటుందా?" అడిగాను.

ఆవిడ నావైపు ఆశ్చర్యంగా చూసి, "ఎవరు చెప్పారు నీకూ?" అంది.

"ధీరజ్ చెప్పాడు" అన్నాను.

"ఓ!" ఆవిడ కళ్ళెగరేసి" అయితే కాబోయే పెళ్ళాం ఎలా వుంటుందో కూడా అడగలేక పోయావా వాడ్ని" అన్నారు.

"ఫోటో చూపించమని అడుగుదామని అనుకున్నాను, ఇంతలో ఇవాళ వాళ్ళే వస్తున్నారని మీరు చెప్పారు" అన్నాను.

"అవును. ఈ పాటికి వచ్చే వుంటారు. పద ఇంటికి వెళ్దాం" అన్నారు.

"మీకు ఆనందంగా వుందా? మేనరికం చేసుకుంటున్నందుకూ?" అడిగాను.

"ఎందుకుండదూ?" అంది ఆవిడ. దారిలో చీరల షాప్ దగ్గర ఆగి, రెండు చేనేత చీరలు కొన్నారు .ఒకటి చిలకాకు పచ్చకి ఎరుపు అంచూ, గంధపు రంగుకి ఆకుపచ్చ అంచూనూ.

"నీకేది నచ్చిందీ?" అడిగారు.

"నాకెందుకూ?" అన్నాను.

"నువ్వు నా కూతురిలాంటిదానివి, ఉత్త చేతులతో పంపిస్తానా?" అన్నారు.

"అయితే పారెట్ గ్రీన్ ది" అన్నాను.

రెండో చీర మందాకినికే ఇస్తారు అనుకున్నాను.

మేం ఇంటికొచ్చేసరికి తాతయ్యతో ఇంకో పెద్దాయన మాట్లాడ్తూ వీధి వరండాలో కనిపించారు.

"ఎంతసేపయిందన్నయ్యా వచ్చి?"

" ఓ అరగంటైంది అమ్మా. ఈ అమ్మాయేనా? హైదరాబాద్ నుండి వచ్చిన సీత మేనకోడలూ?" అన్నారు ఆయన.

నేను నమస్కారం పెట్టాను.

ధీరజ్ మోటర్ సైకిల్ మీద ఎక్కడినుండో వచ్చాడు.

"మావయ్యా బావున్నావా? మందాకిని ఏదీ?" అన్నాడు వస్తూనే.

నాకు చివుక్కుమంది.

కాబోయే పెళ్ళాం మీద ఎంత ప్రేమా? అనిపించగానే పరిమళకి చాలా అన్యాయం జరుగుతోందన్న భావంతో.

"అది రాగానే స్నేహితుల దగ్గరకి పరుగుతీసింది ఆగుతుందా ?" అన్నాడాయన.

"ఈ పూట అన్నీ దానికి ఇష్టమైనవే అన్నయ్యా, జున్ను కూడా వండాను. గౌరి దాన్ని పిలుచుకురా" అంది అరవింద.

"అలాగే అమ్మా" గౌరి వెళ్ళింది.

"అబ్బా! అది ఎందుకు ఒక చోట వుండదూ? దానికోసం గిటార్ తెచ్చాను వాయిస్తుందనీ" ధీరజ్ సంతోషంగా అన్నాడు.

నాకు మండిపోయింది.

"అందరూ కాళ్ళు కడుక్కోండి వడ్డిస్తాను" అరవింద వంట గదిలోకి వెళ్ళారు.

"మందాకిని రానీ" అన్నాడు ధీరజ్.

మరీ ఓవర్ ఏక్షన్. చూడలి ఎంతటి అందగత్తో అనుకున్నాను. పాలరాతి బొమ్మలాంటి పరిమళ నా కళ్ళలో మెదిలింది.

"నేను రాను.. ఊ.. ఆడుకుంటా" అని వినిపించింది.

తల తిప్పి చూస్తే, గౌరి ఒక పదేళ్ళ పాపని ఎత్తుకొస్తోంది. పాప గింజుకుంటోంది.

"మందూ! ఏయ్ నీకోసం ఏం తెచ్చానో తెలుసా?" ధీరజ్ వెళ్ళి బుగ్గలు గిల్లాడు.

గౌరి చేతిలోంచి చెంగున దూకి, ఫ్రాక్‌తో బుగ్గలు తుడిచేసుకుని "అత్తయ్యా ఆడుకుంటుంటే గౌరి లాక్కొచ్చింది" అంది ఆ పాప. తెల్లగా బొద్దుగా వుంది.

అరవింద నవ్వుతూ "రుషీ చూసావా అమ్మా మా కోడల్ని? ఇదే మా మందాకిని. బావుందా?" అన్నారు.

నేను షాక్‌లో ధీరజ్ వైపు చూసాను.

తల్లీ కొడుకులిద్దరూ నవ్వుతున్నారు.

తాతగారూ, మందాకిని తండ్రీ అర్థంకాక చూస్తున్నారు.

మందాకిని ధీరజ్ ఇచ్చిన గిటార్ బొమ్మతో ఆడుతోంది.

నాకు నేను ఎంత ఫూల్ అయి ఇంతదూరం పరిగెత్తుకు వచ్చానో, పరి ఎంత ఫూలిష్‌గా ఇదంతా నమ్మి ఏడ్చిందో అర్థమయి, కొంచెం కోపం వచ్చినా, అంతకుమించి ఎంతో రిలీఫ్‌గా అనిపించింది.

సరదాగా అందరం కలిసి భోంచేసాం. ధీరజ్ చేసిన ప్రాక్టికల్ జోక్ అరవింద అందరికీ చెప్పారు. "మందాకినిని ధీరూ పెళ్ళి చేసుకుంటానని చెప్పాడుట. ఈ పిల్ల నమ్మేసింది" అని.

నాకైతే త్వరగా అన్నం తినేసి పరికి ఫోన్ చేసెయ్యాలని ఆతృతగా వుంది.

రెండు చీరలూ అరవింద ఆంటీ నాకే పెట్టారు.

"ఎందుకలా చెప్పావ్ పరికి?" రైలు కదులుతుండగా, ధీరజ్‌ని అడిగాను.

"నిజంగా నన్ను ప్రేమిస్తే నేను పడ్తున్న నరకం అర్థం అవ్వాలని" అన్నాడు.

"మరి పరిని నువ్వు?" అన్నాను.

"ఎన్ని జన్మలైనా ఎదురు చూస్తానే ..." రైలు కదలడంతో చివరిమాట కలిసిపోయింది.

నేను ఈ ప్రయాణంలో రెండు విషయాలు అర్థం చేసుకున్నాను.

ప్రేమ అనే నీరు పోసి బంధాలని పాదులని పెంచినట్లు పెంచుకోవాలి.

అపనమ్మకానికి నిజమైన ప్రేమున్నచోట తావులేదు.

పరిమళ "నిజం? ఈజ్ ఇట్ ట్రూ?" అని ఎంత సంతోషంగా అడిగి అడిగి చెప్పించుకుందో అతనన్న ఆ చివరి మాట.

తొందరపాటు – ఓ క్షణంలో నిర్ణయాలు తీసుకుని ఏళ్ళ తరబడి పొగిలేట్లు చేస్తుంది.

ఎందుకే నీకింత తొందరా... అని ప్రతివాళ్ళూ మనసుని ప్రశ్నించే ఒక సందర్భం వస్తుంది. రాక తప్పదు.

ఇంటికొచ్చాక మా క్రిష్ణమూర్తీ, వసుంధరా మళ్ళీ నా పెళ్ళి సంబంధాల ఆట మొదలు పెట్టారు. పిల్లికి చెలగాటం ఎలుకకి ప్రాణసంకటంలా వుంటుంది ఈ పెళ్ళి చూపులవేట.

"రవికాంత్.. అమెరికాలో చదువుకుని వచ్చినా ఎంత బుద్ధిమంతుడో, అమ్మా నాన్నలు చెప్పినమాట జవదాటడుట. పిల్లాడి తల్లికి నువ్వు తెగ నచ్చేసావు" టిఫిన్ పెడ్తూ, ఎక్స్‌ట్రా ప్రేమతో ఇడ్లీల మీద నెయ్యి పోసేస్తూ అంది అమ్మ.

"ఏ ఫోటో చూసి నేను నచ్చానమ్మా?" అడిగాను.

"ఏదో ఇచ్చాలే. నా సెల్‌లో వున్నది" అని దాటెయ్యబోయింది.

"పప్పీ పెళ్ళిలో నడుముకి వడ్డాణం, జబ్బలకి దండ కడియాలో, అరదండాలో, తలనిండాపూలూ, పట్టుచీరా, మొహాన బొట్టూ, కళ్ళకి కాటుకా అదేనా?" అడిగాను.

"అదే.. లక్షణంగా వున్న ఫోటో పంపాను" అంది.

"మరి ఈ చేతులు లేని బనీన్, పొట్టి స్కర్ట్, సానలా బొట్టులేని మొహం, జుట్టు విరబోసుకుని, నీ భాషలో మారెమ్మలా ఇలా కూడా నా ఒరిజినల్ రూపం ఓ ఫోటో పంపమ్మా. లేదంటే జగన్మోహిని సినిమాలో జయమాలిని అసలు రూపం చూసి దడుచుకున్నట్లు దడుచుకుంటారేమో" అన్నాను.

నాన్నకి నవ్వొచ్చింది.

"వాళ్ళేంటమ్మా ఒక్కోసారి అర్ధరాత్రి ఏ ఫ్రిజ్ దగ్గరో నువ్వు నడుస్తుంటే చూసి నేనే దడుచుకుంటాను . అదీ లేట్ నైట్ హర్రర్ సినిమాలు చూసినప్పుడు మరీ.." అన్నారు నాన్న.

"ప్రతి టాపిక్ జోక్‌గా తీసుకోకండి. ఆ పరిమళలా దీనికీ ముప్పై వచ్చేస్తే ఇంక దక్కినకాడికే కూడు. అని ఏ రెండో పెళ్ళి వాడినో కట్టుకోవాల్సి వస్తుంది" అంది సీరియస్ అవుతూ వసుంధర.

"రెండో పెళ్ళి అంత తప్పా అమ్మా? అసలు డబ్బున్న రిచ్‌మేన్‌ని, అదీ ఏ సినిమా హీరోనో, ప్రొడ్యూసర్నో చేసేసుకుంటే ప్రాణం 'సుకూన్' వుంటుంది. ఆయన కూతుళ్ళూ, నేనూ కూడా కలిపి పురుదు పోసేసుకోవచ్చు. పత్యం కామన్‌గా వసుంధర చేసి పెడ్తుంది" అన్నాను.

"నన్ను చంపుకు తినకు. ఈసారికి ఇలా కానియ్యి" నాకు దండం పెట్టింది వసుంధర.

"ఈసారికీ అంటే? ఇదేమైనా టీ.వీ సీరియలా? మళ్ళీ పెళ్ళి వుంటుందా నాకు? వాట్ ఆర్ యూ టాకింగ్? 'ఆయనా మా ఆయనే ', 'గోదాట్లో దీపం', 'ఇంటికి కొరకంచు కోడలే' ఇవన్నీ చూడడం కొన్ని రోజులు ఆపెయ్" అన్నాను.

"బీ సీరియస్ తల్లీ. ఈ ఏడు నీ పెళ్ళి చేద్దాం అనుకుంటున్నాను" అన్నారు డాడి.

"ఆ అబ్బాయి గురించి నాకూ, నా గురించి అతనికీ ఏం తెలుసు నాన్నా? ప్యాంటూ షర్టూ టక్ చేసుకున్న అతని ఫోటో నేనూ, పట్టుచీరలో లక్ష్మీ దేవిలా వున్న నా ఫోటో అతనూ చూస్తే తెలిసిపోతుందా? అర్ధం అయిపోతుందా? అతని భావాలేంటో? కాబోయే భార్య వర్జిన్ అయివుండాలని అనుకుంటున్నాడా? ఇవన్నీ అక్కరలేదా?" చివరి బాణం కూల్‌గా వదిలేసి లేచి వెళ్ళిపోయాను.

"ఏవండీ.. ఏవంది అది?" వసుంధర బీ.పి పెరిగినట్లుంది. గుండె పట్టుకుంటూ అడిగింది.

"ఎక్స్‌ట్రా వర్జిన్ ఆయిల్స్‌తో టిఫిన్స్ చెయ్యొద్దు అని అంటోందిలే" నాన్న కవరింగ్.

"కాదు. కాబోయే పెళ్ళాం వర్జిన్ అయి వుండాలనుకుంటాడేమో అంది. నేను విన్నాను."

అమ్మ ఏడవడానికి రెడీ అయిపోయింది.

సలు ఆ విషయానికి ఈ కాలంలో కూడా ఇంత ఇంపార్టెన్స్ ఇచ్చి 1970లలో సినిమాల్లోలా ఏడుస్తోందేమిటి? నలిగిపోయిన పూలమాలా, తాగేసాక బూటుకాలితో నలిపేసిన సిగరెట్ పీకా, సింబాలిక్‌గా నాలుగు కుక్కలు, డస్ట్‌బిన్ దగ్గర చింపుతున్న విస్తరీ.. ఫ్యాన్‌కి వేలాడే చీరా! కొంపదీసి నన్ను అలా ఊహించుకోవడంలేదు కదా! అనిపించింది.

నాన్న అమ్మని సమాధానపరుస్తున్నారు. "దానికి కొంచెం తిక్క, నిన్ను రెచ్చగొట్టడానికి ఏదో ఒకటి మాట్లాడ్తుంది. దాని అన్ని మాటలకీ అర్థాలు వుండవు. జస్ట్ కిడ్డింగ్" అంటున్నారు.

"నాన్నా నేను లింగ్విస్టిక్స్‌లో ఎం.ఏ చేద్దామ అనుకుంటున్నాను. యు.ఎస్.లో" అన్నాను వచ్చి కూర్చుంటా.

"మళ్ళీ ఇది మిగిలిందా? హనీగాడిని చదివించడానికే ముప్పతిప్పలు పడ్తున్నాం. నీకోసం మా ఇల్లు అమ్మాలా? నిలువనీడ లేకుండా చేస్తావా?" వసుంధర ఆవేశపడింది.

"అందుకు స్పాన్సరర్ వున్నాడు. ఆవేశపడకు" అన్నాను.

"స్పాన్సరరా? ఇదేమైనా టీ.వి ప్రోగ్రామా?" అనారు నాన్న.

"అతని పేరు ద్వారకా నందన్. నాకు అమెరికా వెళ్ళేటప్పుడు ఫ్లయిట్‌లో పరిచయం అయ్యాడు" అన్నాను.

"నా ఫ్రెండ్ కూతురు తన ఫేస్ బుక్ ఫ్రెండ్ కబీర్ అనేవాడినే పెళ్ళాడుతానని కూర్చుందట. తీరా అతన్ని వెతుక్కుంటూ వెళితే బీచ్ దగ్గర అడుక్కునే వాడని తెలిసిందట" అంది అక్కసుగా అమ్మ.

"అవును. అయ్యే ఛాన్స్ వుంది. కానీ ఇతను ఎవరో, ఏం చేస్తాడో వాళ్ల అమ్మగారినీ, అన్నీ చూసాను నేను. అత్తయ్యా మావయ్య కూడా చూసారు. చాలాసార్లు ఇంటికొచ్చాడు" అన్నాను.

"వాళ్ళ నాన్నగారేం చేస్తారు?" నాన్న అడిగారు.

"మీ ఏం కావాలి అసలు? నేను ఓ అబ్బాయి నాకు నచ్చాదు అని చెప్తుంటే వాళ్ళ అమ్మా నాన్నా డిటైల్స్ అడుగుతారేంటీ? వాళ్ళతో మీకే సంబంధం అసలు? మీరేమైనా వాళ్ళతో కలిసుంటారా?" నాకు నిజంగానే తిక్క రేగింది.

"పెళ్ళి అంటే అటు ఆరు తరాలూ, ఇటు ఆరు తరాలూ చూడాలి. పోనీ ఒక్క తరం అయినా చూసే అవకాశం మాకు ఇయ్యవా?" అంది అమ్మ.

"పెళ్ళి.. ఈ మాట నేను అసలు అనలేదు. అతను నచ్చాదు అన్నాను. అన్నీ బావుంటే అది తర్వాత జరుగుతుంది. పూర్తిగా లీగాలిటీస్‌లోకి అప్పుడే ఎందుకని?" అన్నాను.

"అంటే? పెళ్ళికాకుండానే ఇద్దరూ " అని అమ్మ అడిగింది.

"లివిన్‌లో వుందామనీ ... కొన్నిరోజులు..."

నాన్న బలంగా టీపాయ్‌ని తన్నారు. దానిమీద కప్పులూ, సాసర్లూ ఎగిరిపడ్డాయి. బహుశా ఆ తన్ను నన్ను తన్నాలనిపించి వుంటుంది.

"ఈ తన్ను నువ్వు మా గుండెలమీద తన్నావు" నాన్న అన్నారు. ఎర్రగా అయిపోయారు.

ఇంత ఎమోషనల్ అవుతారానుకోలేదు.

"బావుందమ్మా మా అమ్మాయి ఎవడితోనో సహజీవనం చేస్తుందిట. అని ఫంక్షన్ కూడా చేద్దాం" అంది అమ్మ.

అదికూడా ఒక పబ్లిక్ ఎనౌన్స్‌మెంట్ మళ్ళీ ఎందుకు వీళ్ళు ఇంత బాధపడ్తున్నారూ? వీళ్ళు చెప్పిన సంబంధం చేసుకుని, ఆ తర్వాత పడక గొడవలు పడి, అశాంతితో రగిలిపోయి, కోర్టులకెక్కి విడాకులు తీసుకుని ఈ రిస్క్ లేదనే వీళ్ళ అభిప్రాయమా?

ట్రావెల్ ఇన్సూరెన్స్ ఎందుకు తీసుకుంటాం? ఇన్నిసార్లు ట్రావెల్ చేసాం. ఎప్పుడైనా ఫ్లయిట్ పడిపోయిందా? కాదు ఎవరికో ఒకరికి జరిగింది కాబట్టి మనకి జరగకూడదు. రిస్క్ వద్దనేగా ఇన్సూరెన్స్ తీసుకుంటాం. ఇదీ నూటికి అరవై శాతం ఫెయిల్ అవుతున్నా  రిస్క్ తీసుకుంటాం. ముక్కూ, మొహం, కాళ్ళూ చేతులూ వుంటే చాలు పెళ్ళి చేసేస్తాం. అందర్నీ పిలిచి ఖరీదైన హోటల్‌లో బఫేఇచ్చి, తలకి రెండు వేలు చొప్పున ఇరవై లక్షలు సమర్పించుకుని, అమ్మయ్యా 'ఆడపిల్ల తల్లితండ్రులుగా మా బాధ్యత తీర్చుకున్నాం' అని, అప్పుల వాళ్ళ ప్రోనోట్లతో, స్థిమితంగా పడుకోవడమా, నేచురల్‌గా బిహేవ్ చెయ్యడం  అంటే?

అప్పు మొదటి వడ్డీ కట్టకుండానే, వాళ్ళిద్దరూ హనీమూన్‌లో గొడవ పడ్తేనో, ఇంత ప్రాక్టికాలిటీ ఈ పెద్దవాళ్ళకి లేదేం?

"పిచ్చి పిచ్చి వేషాలు వెయ్యకు. వాళ్ళ పెద్దవాళ్ళని తీసుకుని రమ్మను. మాట్లాడదాం. కావాలంటే కులం కూడా పట్టించుకోము" నాన్న అభ్యుదయం వైపు అడుగులేస్తున్నట్లు ఫేస్ పెట్టారు.

వసుంధర అప్పుడే గుండె పట్టుకుంది.

"ఏవిట్రా? గొడవపడ్తున్నారు?" అడుగుతోంది బామ్మ.

ఈ సందర్భంలో ద్వారకా పేరెంట్స్ ఇద్దరూ విడిపోయారు ఒకళ్ళు అమెరికాలో వుంటారు అని చెపితే ఇంకెంత డ్రామా జరుగుతుందో అనిపించింది.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

COMMENTS